TEL:T/TG/2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు    తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

**విలేఖరులు కావలెను...**

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954

పబ్లిషర్ : హైదరాబాద్ | సంపుటి :01 | సంచిక : 125 | శనివారం 28-12-2024 | పేజీలు :05 | వేల :05/-

## మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల

## మోదీ సహా ప్రముఖుల నివాళి





**హైదరాబాద్ (మన వెలుగు) డిసెంబర్ 27 :** భారత మాజీ ప్రధాని, కాంగ్రెస్ సీనియర్ మన్మో హన్ సింగ్ గురువారం రాత్రి కన్నుమూశారు. ఆయన మరణం పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, భారత ప్రధాని నరేంద్ర మోదీ సహా పలువురు ప్రముఖులు సంతాపం తెలియజేశారు. భారత మాజీ ప్రధాని, కాంగ్రెస్ సీనియర్ నేత మన్మోహన్ సింగ్ గురు వారం రాత్రి మరణించారు. గురువారం సాయంత్రం తీవ్ర అస్వస్థతకు గురైన ఆయన్ను ఢిల్లీల ోని ఎయి మ్స్ ఎమర్జెన్సీ విభాగంలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. మన్మోహన్ సింగ్ మరణం పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీష్ ధన్ ఖడ్, ప్రధాని మోదీ సహా పలువురు ప్రముఖులు సంతాపం ప్రకటించారు. దేశం గొప్పనేతను కోల్పోయిం దని,దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మృతి పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సంతాపం ప్రకటించారు. ఐదేండ్లు దేశా నికి ప్రధానిగా ఉన్న మన్మోహన్ సింగ్, గొప్ప ఎకనామిస్ట్ లీడర్ రీఫార్మర్ అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటు





**హైదరాబాద్ (మన వెలుగు) డిసెంబర్ 27 :** దేశం ఆర్థికంగా క్లిష్ట సమయంలో వున్నప్పుడు మాజీ ప్రధాని పీవీ నరసింహారావు తెచ్చిన ఆర్థిక సంస్కరణలను అమలు చేయడంలో ఆర్థికరంగ నిపుణుడుగా తన విద్వత్తును ప్రదర్శించారు.పీవీ మనసు గెలిచిన మన్మోహన్ సింగ్ ఆనేక ఉన్నత శిఖరాలకు చేరుకున్న భరతమాత ముద్దుబిడ్డగా కొనియాడారు. భారత ప్రధానిగా డాక్టర్ మన్మోహన్ సింగ్ హయాంలోనే తెలంగాణ ఉద్యమాన్ని, ప్రజల మనోభావా లను అర్థం చేసుకుని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంపూర్ణ మద్దతు ప్రకటించి తెలంగాణను ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేసి తెలంగాణ ప్రజల కలను సాకారం చేసి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరగడం చారిత్రక సందర్భమని తెలంగాణ ఏర్పాటుకు వారందించిన మద్దతును, చేసిన కృషిని తెలంగాణ సమాజం సదా గుర్తుంచుకుంటుందని అన్నారు. మిత భాషిగా, అత్యంత సౌమ్యుడుగా, జ్ఞానాన్ని సొంతం చేసుకున్న స్థిత ప్రజ్ఞత కలిగిన నేతగా, భారత ప్రధానిగా మన్మోహన్ సింగ్ దేశానికి అందించిన సేవలు గొప్పవి.2014 లో బిజెపి చేసిన బలహీన ప్రధాని అనే విమర్శలకు కౌంటర్ ఇచ్చాడు. నేను వీక్ పీఎం కానేకాదు. పరిస్థితులకు అనుగుణం గా బాగానే పనిచేశా. సమకాలీన మీడియా కంటే చరిత్ర నన్ను దయతో గుర్తుపెట్టు కుంటుంది.గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ ప్రజలకు పని కల్పిస్తున్న ఉపాధి హామీ పథకాన్ని మన్మోహన్ సింగ్ హయాంలోనే ప్రారంభించారు.

## శబరిమల అయ్యప్ప స్వామి ఆలయం మూసివేత

**శబరిమల (మన వెలుగు) డిసెంబర్ 27 :** శబరిమల ఆలయాన్ని అధికారులు మూసివేశారు. మండల పూజలు ముగియడంతో దర్శనాలు ఆపేశారు. ఈ నెల 30న ఆలయం తిరిగి తెరుచుకోనుంది. ఇప్పటివరకు 32.50 లక్షల మంది భక్తులు అయ్యప్ప స్వామిని దర్శించు కున్నారు. శబరిమల కొండపై జనవరి 14న మకరజ్యోతి దర్శనం జరగనుంది. జనవరి 20న పడిపూజతో యాత్ర ముగియనుంది.

## అల్లు అర్జున్ బెయిల్ పిటిషన్ విచారణ వాయిదా

- ఈ నెల 30 కి వాయిదా పడ్డ బెయిల్ పిటిషన్‌పై విచారణ
- కౌంటర్ దాఖలు చేయడానికి సమయం కోరిన పోలీసులు



**హైదరాబాద్ (మన వెలుగు) డిసెంబర్ 27 :** సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో నటుడు అల్లు అర్జున్ బెయిల్ పిటిషన్ పై విచారణ వాయిదా పడింది. తనకు రెగ్యులర్ బెయిల్ ఇవ్వాలని బన్నీ నాంపల్లి కోర్టులో పిటిషన్ వేశారు. కౌంటర్ దాఖలు చేసేందుకు పోలీసులు సమయం కోరడంతో విచారణను ఈ నెల 30వ తేదీకి వాయిదా వేస్తున్నట్టు కోర్టు తెలిపింది. ఇక తొక్కిసలాట ఘటన నేపథ్యంలో బన్నీని ఇటీవల పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. కానీ, ఆయనకు హైకోర్టు నాలుగు వారాల మధ్యంతర బెయిల్ ఇవ్వడంతో విడుదలయ్యారు. మరోవైపు నాంపల్లి కోర్టు ఈ నెల 13న విధించిన 14 రోజుల రిమాండ్ నేటితో ముగిసింది. దీంతో బన్నీ ఈరోజు వర్చువ ల్‌గా న్యాయస్థానం ముందు విచారణకు హాజరయ్యారు. కాగా, సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనపై విచారణనూ నాంపల్లి కోర్టు వాయిదా వేసింది. దీనిపై తదుపరి విచారణను జనవరి 10న చేపట్టనున్నట్లు వెల్లడించింది. అదే రోజు బన్నీ రిమాండ్‌పైనా కూడా విచారణ ఉండనుంది.

## ఏఐ టూల్స్ వినియోగదారుల రక్షణకు ప్రభుత్వం కీలక చర్యలు

### ఏఐ ద్వారా మోసాలకు అడ్డుకట్ట




**హైదరాబాద్ (మన వెలుగు) డిసెంబర్ 27 :** పపంచవ్యాప్తంగా టెక్నాలజీ రంగంలో ఏఐ సృష్టిస్తున్న సంచలనాలు అందరికీ తెలిసిందే. ముఖ్యంగా ఏ అవసరం వచ్చినా సాఫ్ట్‌వేర్ కంపెనీ ఏఐ టూల్స్‌నే ఆశ్రయిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వినియోగదారులను ఈ-కామర్స్ మోసాల నుంచి రక్షించడానికి భారతదేశ ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంది. ఏఐ టూల్స్ ద్వారా మోసాలకు అడ్డుకట్ట వేయనుంది.ఆహార, వినియోగదారుల వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి వినియోగదారుల రక్షణను బలోపేతం చేయడానికి అనేక రక్షణ చర్యలను తీసుకుంటున్నట్లు ఇటీవల ప్రకటించారు. ఇందులో ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా హెల్ప్‌లైన్, మోసపూరిత మార్కెటింగ్ పద్ధతులను గుర్తించే సాధనాలు అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. ముఖ్యంగా ప్రధాన ఈ-కామర్స్ కంపెనీలు ఆన్‌లైన్ షాపింగ్ భద్రతను పెంచే విధంగా ఈ చర్యలు తీసుకున్నారు. ఏఐ ఎనేబుల్డ్ నేషనల్ కన్స్యూమర్ హెల్ప్‌లైన్, ఈ-మ్యాప్ పోర్టల్, జాగో గ్రాహక్ జాగో మొబైల్ అప్లికేషన్ వంటి నూతన వినియోగదారుల రక్షణ చర్యలను ప్రభుత్వం రూపొందించింది. దీంతో ప్రముఖ కంపెనీలైన రిలయన్స్ రిటైల్, టాటా సన్స్, జొమాటోతో సహా ప్రముఖ ప్లాట్‌ఫారమ్‌లు ఈ భద్రతా చర్యలను తమ యాప్స్‌లో అందిస్తామని పేర్కొన్నారు. వినియోగదారుల వివాదాల పరిష్కారాన్ని వేగవంతం చేయడంలో గణనీయమైన పురోగతి సాధించామని జాతీయ వినియోగదారుల దినోత్సవ కార్యక్రమంలో మంత్రి జోషి అన్నారు.ఈ ఏడాది జనవరి నవంబర్ మధ్య జాతీయ కమిషన్‌లో దాఖలైన 3,628 కేసులలో 6,587 కేసులను దేశంలోని త్రీ-టైర్ వినియోగదారుల కోర్టు వ్యవస్థ ద్వారా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో పరిష్కరించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వానికి సంబంధించిన ఈ-దాఖిల్ పోర్టల్ 2020లో ప్రారంభించారు. జూన్ 2023లో దేశవ్యాప్తంగా విస్తరించారు. కర్ణాటక, పంజాబ్ మరియు రాజస్థాన్ వంటి రాష్ట్రాలతో పాటు అనేక జిల్లాల్లో ఆన్‌లైన్ ఫిర్యాదుల కోసం 100 శాతం స్వీకరణను సాధించింది.పెరుగుతున్న ఈ-కామర్స్ కొనుగోళ్లు ప్రజలను ఆకర్షిస్తున్నప్పటికీ, వినియోగదారుల భద్రత, మోసాలకు అడ్డుకట్ట వేయడమే తమ లక్ష్యమని మంత్రి జోషి పేర్కొన్నారు. ముఖ్యంగా సరోగేట్ ప్రకటనలను నియంత్రించేందుకు ఇటీవల వినియోగదారుల రక్షణ అథారిటీ (సీపీపీఏ) కొత్త మార్గదర్శకాలను రూపొందిస్తుంది. ఇప్పటికే ఉన్న నిబంధనలను పాటించని 13 కంపెనీలకు నోటీసులు జారీ చేసిందని, వినియోగదారుల రక్షణే ముఖ్యమని వివరించారు.

### అల్లు అర్జున్ ట్యాలెంటెడ్ యాక్టర్

# ఆయనతో నన్ను పోల్చొద్దు అమితాబ్ బచ్చన్

- కౌన్ బనేగా కరోడ్ పతి కార్యక్రమంలో అమితాబ్ వ్యాఖ్యలు
- అన్ని గుర్తింపులకు అల్లు అర్జున్ అర్హుడన్న అమితాబ్
- పుష్ప-2 సినిమా ఘన విజయం సాధించిందని ప్రశంస



**హైదరాబాద్ (మన వెలుగు) డిసెంబర్ 27 :** స్టార్ హీరో అల్లు అర్జున్ పై బాలీవుడ్ స్టార్ అమితాబ్ బచ్చన్ ప్రశంసలు కురిపించారు. అల్లు అర్జున్ ఎంతో ప్రతిభావంతుడు అని బిగ్ బీ కొనియాడారు. 'కౌన్ బనేగా కరోడ్ పతి' షోలో ఓ కంటెస్టెంట్ తో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కౌన్ బనేగా కరోడ్ పతి' సీజన్-16 ప్రస్తుతం కొనసాగుతోంది. తాజా ఎపిసోడ్ కు కోల్ కతా నుంచి ఓ గృహిణి కంటెస్టెంట్ గా వచ్చారు. ఆమె మాట్లాడుతూ... తనకు అమితాబ్ బచ్చన్, అల్లు అర్జున్ అంటే ఇష్టమని చెప్పారు. దీనిపై అమితాబ్ స్పందిస్తూ... తనకు వచ్చిన అన్ని గుర్తింపులకు అల్లు అర్జున్ అర్హుడని అన్నారు. 'పుష్ప-2' చిత్రం ఘన విజయం సాధించిందని... ఎవరైనా ఆ సినిమాను చూడకపోతే వెంటనే చూడాలని చెప్పారు. అల్లు అర్జున్ చాలా ట్యాలెంటెడ్ యాక్టర్ అని... ఆయనతో తనను పోల్చవద్దని అన్నారు. ఈ క్రమంలో సదరు మహిళా కంటెస్టెంట్ మాట్లాడుతూ... కొన్ని సన్నివేశాల్లో మీ ఇద్దరి మేనరిజం ఒకే విధంగా ఉంటుందని చెప్పారు. ఈ షో ద్వారా మిమ్మల్ని కలుసుకున్నానని... ఏదో ఒక రోజు అల్లు అర్జున్ ను కూడా చూస్తే తన కల నెరవేరుతుందని అన్నారు.

# మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కు నివాళి

**కరీంనగర్ (మన వెలుగు) డిసెంబర్ 27 :**
మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణించడం పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ నేడు కరీంనగర్ డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మానకొండూరు ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డా. కవ్వంపల్లి సత్యనారాయణ గారు హాజరై సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కరీంనగర్ అసెంబ్లీ ఇంచార్జ్ పురుమళ్ల శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, పిసిసి కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్, డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి గారితో కలిసి మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం మన్మోహన్ సింగ్ మృతి పట్ల సంతాపం తెలియజేస్తూ కవ్వంపల్లి సత్యనారాయణ గారు పార్టీ శ్రేణుల సమక్షంలో కాంగ్రెస్ పార్టీ జెండాను సగం క్రిందికి దించి అవనతం చేయడం జరిగింది.మన్మోహన్ సింగ్ ఆత్మకు శాంతి చేకూరాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయ కులు క్రిస్టియన్ మైనార్టీ నేత బొబ్బిలి విక్టర్ ఆధ్వర్యంలో ఇందిరా చౌక్ వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడం జరిగింది.అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి నేతలు మాట్లాడుతూ మన్మోహన్ సింగ్ గారు మరణించడం కాంగ్రెస్ పార్టీకి భారతదేశానికి తీరని లోటు, నష్టాలతో అస్తవ్యస్తంగా ఉన్న ఈ దేశంలో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టి ఆర్థిక రంగాన్ని సుస్థిరపరిచిన మేధావి మన్మోహన్ సింగ్, ఆయన ప్రధానిగా ఉన్నప్పుడే తెలంగాణ రాష్ట్రం సిద్ధించింది, విదేశాలలో ఉన్నత చదువులు అభ్యసించి ప్రొఫెసర్ గా ఆర్బిఐ గవర్నర్ గా హార్దిక శాఖ మంత్రిగా ఎన్నో ఉన్నత పదవులు చేపట్టి ఆ పదవులకు న్యాయం చేసిన గొప్ప వ్యక్తి. ఆధార్ కార్డు, ఆహార భద్రత కార్డు, వందరోజుల పని దినాలు, లాంటి ఎన్నో శాశ్వత ప్రయోజనాలు వారి హయాంలోనే రావడం జరిగింది, పరిశ్రమల స్థాపన కోసం సరళీకృత విధానాన్ని ప్రవేశపెట్టిన గొప్ప వ్యక్తి అంతటి మహోన్నతమైన నాయకుడిని కోల్పోవడం చాలా బాధాకరం. వారు అనుభవించిన నిరాడంబర జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని, మన్మోహన్ సింగ్ కన్న కలలను సహకారం చేయడానికి పార్టీ శ్రేణులమైన మేమంతా కంకణ బద్దులమై పని చేస్తామని అన్నారు. వారి మృతి పట్ల ఏఐసీసీ పిలుపుమేరకు జిల్లా కాంగ్రెస్ పక్షాన ఏడు రోజుల పాటు సంతాప దినాలు ప్రకటిస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమాల్లో నాయకులు కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, ఎండి తాజ్, వైద్యుల అంజన్ కుమార్, పులి అంజనేయులు గౌడ్, కర్ర సత్య ప్రసన్న రెడ్డి, హైమద్ అలీ, ముస్తాక్ అహ్మద్ ,వెన్న రాజ మల్లయ్య, నిహాల్ అహ్మద్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, దన్ను సింగ్, కలవల రామచందర్, వంగల విద్యాసాగర్ నాగుల సతీష్ రామిడి రాజిరెడ్డి సిరిపురం నాగప్రసాద్ బాకార శివయ్య, బాల భద్ర శంకర్ లాయేక్ అమీర్, హసీనా, మాదాసు శ్రీనివాస్, దికొండ శేఖర్, కోడూరు రవీందర్ గౌడ్, బండి శరణ్య గౌడ్, కరీం, పర్వత మల్లేశం ,హస్తపురం తిరుమల, హురడి లతా, చంద్రశేఖర్, జనార్ధన్, నూనె గోపాల్ రెడ్డి, శివ, పెద్ద గారి తిరుపతి, నాగరాజుగౌడ్, నూనె గోపాల్ రెడ్డి ,జ్యోతి రెడ్డి, కుంబాల రాజ్కుమార్, సత్తినేని శ్రీకాంత్, మూల జయపాల్, సంపత్ గౌడ్ ,దిలీప్, సుదర్శన్, జొన్నల రమేష్, ఉరడి లతా, అందశంకర్, తదితరులు పాల్గొన్నారు.



# డ్రైవర్ రహిత మెట్రోరైలు ట్రయల్ రన్



**చెన్నై (మన వెలుగు) డిసెంబర్ 27 :** డ్రైవర్ రహిత మెట్రోరైలు ట్రయల్ రన్ ప్రారంభమైంది. త్వరలో ఈ మెట్రో రైలు ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది. చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) రెండో విడత ప్రాజెక్ట్ డ్రైవర్ రహిత మెట్రో రైళ్లు నడపాలని నిర్ణయించింది.ఈ విషయమై సీఎంఆర్ఎల్ అధికారులు మాట్లాడుతూ డ్రైవర్ రహిత మెట్రోరైలు ట్రయన్ రన్ ప్రారంభించామన్నారు. గంటకు 10 కిలోమీటర్ల నుంచి 40 కి.మీ వేగంతో తొలివిడత ట్రయల్ రన్ జరుగుతుందని తెలిపారు.

### తిరుమల తిరుపతి దేవస్థానంలో

# తెలంగాణ భక్తులకు ప్రాధాన్యత కల్పించండి మంత్రి కొండ సురేఖ


**నంద్యాల (మన వెలుగు) డిసెంబర్ 27 :** తెలంగాణ భక్తులకు తిరుమలలో ప్రాధాన్యం ఇవ్వాలని, మంత్రులు, ఎమ్మెల్యేలు ఇచ్చే లేఖలను తిరుమలలో అనుమతిం చాలని తెలంగాణ అటవీ పర్యావరణ దేవాదాయ ధర్మాశాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. నంద్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దర్శనా ర్థం తెలంగాణ మంత్రి గురు వారం రాత్రే ఆలయానికి చేరుకున్నారు.దేవస్థానం ఈవో శ్రీనివాస రావు ఆమెకు స్వాగతం పలికారు. ఆమె కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం ఉదయం మల్లికార్జున స్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఈ సంద ర్భంగా మంత్రికి అర్చకులు ఆలయ లాంఛనాలతో స్వాగతం పలికారు. రెండు రాష్ట్రాల ప్రజలు సురక్షి తంగా ఉండాలని ఈ సంద ర్భంగా ఆమె పేర్కొన్నారు.అనంతరం ఆమె మీడియా సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా శ్రీ వెంకటేశ్వర స్వామికి భక్తులు ఉన్నారని, వారి కోరిక మేరకు తిరుమల దేవస్థానంలో తెలంగాణ భక్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.తెలంగాణ మంత్రులు, ఎమ్మెల్యేలు ఇచ్చే సిఫారసు లేఖలను తిరుమలలో అనుమతించాలని డిమాండ్ చేశారు. భక్తుల విన్నపాలపై ఏపీ ప్రభుత్వం తమ విజ్ఞప్తిని పరిష్కరిస్తుం దని ఆశిస్తున్నానన్నారు. టీడీటీ తరఫున తెలంగాణ లో ధర్మ ప్రచారానికి నిధు లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం అనుసరించిన విధానా లను కూటమి ప్రభుత్వం అనుసరించాలని కోరారు.




### వైసీపీ పాలనలో అడ్డగోలుగా విద్యుత్ చార్జీలు పెంచి

# నేడు డ్రామాలా అంటూ మండిపడ్డ ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**గుంటూరు (మన వెలుగు) డిసెంబర్ 27 :** గత వైసీపీ ఐదేళ్ల పాలనలో అడ్డగోలుగా అనేకసార్లు విద్యత్ చార్జీలు పెంచిన విషయాన్ని మరచి, ఇప్పుడు తగ్గించాలని నిరసన పేరుతో డ్రామాలు ఆడుతున్నారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం విద్యుత్ చార్జీలు పెంచారంటూ" వైసీపీ నేతలు చేస్తున్న నిరసనలను ఖండిస్తూ ఎమ్మెల్యే గళ్ళా మాధవి మీడియాతో మాట్లాడుతూ,ఈ రోజు వైసీపీ జిల్లా పార్టీ అధ్యక్షులు అంబటి రాంబాబు నేతృత్వంలో ఆ పార్టీ నేతలు గుజ్జనగుండ్ల విధ్యుత్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేసి కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మీద బురద చల్లటాన్ని తాను తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు.ప్రజల మీద ప్రేమ ఉన్నట్లు నటిస్తూ, మొసలి కన్నీరు కారుస్తున్న వైసీపీ నేతలు వారి హయంలో 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై రూ. 32,000 కోట్ల రూపాయల విద్యుత్ భారం వేశారన్నారు.వైసీపీ ఐదేళ్ల పాలనలో అడ్డగోలుగా అనేకసార్లు విధ్యుత్ చార్జీలు పెంచిన విషయాన్ని మరచి ఇప్పుడు తగ్గించాలని నిరసన కార్యక్రమాలకు పిలుపునివ్వటం హాస్యాస్పదంగా ఉందన్నారు.ప్రజలు అన్నీ విషయాలు గమనిస్తున్నార న్నారని, అవినీతి, అక్రమాల కేసుల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు నిరసన కార్యక్రమాల పేరుతో ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని, సౌరవిద్యుత్ ఒప్పందాల్లో ముడుపులు కేసుల్లో అమెరికాలో అడ్డంగా దొరికిపోయిన వైసీపీ అధినేత జగన్ రెడ్డి పోరుబాట పేరిట ప్రజల దృష్టి మరల్చే ప్రయత్నం చేస్తున్నారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి మండిపడ్డారు.



# మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ కు ఘన నివాళులు

**కరీంనగర్ (మన వెలుగు) డిసెంబర్ 27 :** కరీంనగర్ పట్టణంలో స్థానిక రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో వివిధ సంఘాల అధ్వర్యంలో మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ కి నివాళులు అర్పించారు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్.పి.ఐ)రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్. మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనం తరం కుతాడి శివరాజ్ మాట్లాడుతూ,మన్మోహన్ సింగ్ దేశ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు దేశ ప్రతిష్టల కోసం పని చేశారని అన్నారు. దేశ ప్రజల కోసం రాజ్యాంగంలోని చట్టాలను అమలు చేశారని భారత రాజ్యాంగాన్ని దేశ ప్రజలకు ప్రతి మనిషికి హక్కు ఉంటుందని రాజ్యాంగంలో పొందుపరిచిన చట్టాలను అమలు చేశారని మన దేశ ప్రధానిగా విదేశాల నుండి పేరు ప్రతిష్టలు తీసుకొచ్చారని. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఛిత్రపటంకు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ పెండ్యాల అంజయ్య. ఎరుకల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్. సీనియర్ దళిత నాయకుడు మాజీ ఎంపిటిసి దుబ్బల మధు. తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రోళ్ల ప్రశాంత్. నోటరీ వర్క్ కనకం రామకృష్ణ. అనసూరి వెంకన్న.తండ్ర శ్రీనివాస్. గంగయ్య. మహేష్. రాహుల్.తదిత రులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయుసి) జగిత్యాల జిల్లా నూతన కమిటీ లో మెట్పల్లి వాసులు




**జగిత్యాల ప్రతినిధి (మన వెలుగు) డిసెంబర్ 27 :** జగిత్యాల జిల్లా కేంద్రంలో శుక్రవారం మున్సిపల్ కాంట్రాక్టు అవుట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి అనుబంధం జిల్లా మొదటి మహాసభ నిర్వహించారు ఈ మహాసభకు రాష్ట్ర నాయకులు మున్సిపల్ కార్మిక రంగం రాష్ట్ర అధ్యక్షులు కే రవి చందర్ రాష్ట్ర కార్యదర్శి వి జైపాల్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని కార్మికుల హక్కులకై ఐకమత్యంగా పోరాడాలని పలు అంశాలపై మాట్లాడారు అనంతరం జగిత్యాల జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఈ కమిటీలో మెట్పల్లి మున్సిపల్ కార్మికులకు ఐదు పదవులు దక్కాయి మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడిగా బర్ల లక్ష్మన్ కార్యదర్శులుగా లంక శ్రీకాంత్, బి మధురమ్మ, టి సుమన్, పి గంగాధర్, ఎల్ మహేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు అనంతరం వారు మాట్లాడుతూ జిల్లా కమిటీకి ఎన్నుకున్నందుకు రాష్ట్ర నాయకులకు జిల్లా నాయకులకు తోటి కార్మిక సంఘ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సుతారి రాములు, ఎండి ముఖ్రిం, మున్సిపల్ కార్మిక రంగ ప్రధాన కార్యదర్శి ఉస్మాన్, నాయకులు ఉన్న మహేష్, రామిల్ల రాంబాబు, తదితర మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు

# మన్మోహన్ సింగ్ మృతి పట్ల తీవ్ర ద్రిగ్బాంతి వ్యక్తం చేసిన పొన్నం ప్రభాకర్

**కరీంనగర్ (మన వెలుగు) డిసెంబర్ 27 :** మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం పట్ల రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర ధ్రిగ్బాంతి వ్యక్తం చేశారు. 15 వ లోక్ సభ లో ఆయన ప్రధాని గా నేను లోక్ సభ సభ్యుడిగా ఉన్నప్పుడు ఆయన తో కలిసి అనేక సమావేశాల్లో పాల్గొన్నానని గుర్తు చేసుకున్నారు. మన్మోహన్ సింగ్ గొప్ప రాజనీతిజ్ఞుడు భారత ఆర్థిక వ్యవస్థలు నిలదొక్కుకోవడానికి ఆయన ఎన్నో సంస్కరణలు చేశారని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. 2004 - 14 మధ్య దేశ ప్రధాని గా ఆయన ఎన్నో సేవలు చేశారని ఉపాధి హామీ , సమాచార హక్కు చట్టం తదితర చట్టాలు తెచ్చి దేశ రూపురేఖలు మార్చారని మంత్రి పొన్నం ప్రభాకర్ గుర్తు చేసుకున్నారు. 10 సంవత్సరాలు ప్రధాని గా చేసిన అత్యంత నిరడంబరుడుగా ఉండేవారని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో మన్మోహన్ సింగ్ పాత్ర మరవలేనిది అని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మరణం పట్ల తీవ్ర ధ్రిగ్బాంతి వ్యక్తం చేస్తూ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు .వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



# విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు

**కోరుట్ల (మన వెలుగు) డిసెంబర్ 27 :** కోరుట్ల పట్టణం శ్రీనివాస రోడ్డులోని విశ్వబ్రాహ్మణ సంఘం లో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం ఏర్పాటు చేయడమైనది, అధ్యక్షులుగా పవన్, ఉపాధ్యక్షులుగా కత్తి రాజ్ శంకర్, వి,మారుతి, ప్రధాన కార్యదర్శిగా వి, సంజీవ్, కోశాధికారిగా జి శ్రీధర్ , సహాయ కార్యదర్శిగా బి, సత్యం, సాంస్కృతిక కార్యదర్శిగా వి సాగర్, ముఖ్యసలహాదా రులుగా గుండోజి శ్రీనివాస్, వనతడపులఈశ్వర్, గుండోజి సత్యప్రసాద్,మంతెనచంద్రప్రకాష్,పవన్,వి,రమేష్, కార్యవర్గ సభ్యులు, కుల బాంధవులు తదితరులు పాల్గొన్నారు.




# ప్రాణం తీసిన రెండు కుటుంబాల భూ వివాదం

**భూపాలపల్లి (మన వెలుగు) డిసెంబర్ 27 :** రెండు కుటుంబాల భూ తగాదాల మధ్య జరిగిన గొడవలు ఒకరి ప్రాణం తీసాయి కాటారం మండల కేంద్రంలోని ఇప్పల గూడెం కుచెందిన డోంగిరి బుచ్చయ్య(55) అనే వ్యక్తికి అదే గ్రామానికి చెందిన సోదారి లింగయ్య అనే వ్యక్తి కుటుంబం తో గత కొన్ని ఏండ్లుగా భూవివాదం చెదరేగుతుంది. రెండు కుటుంబాల మధ్య ఉన్న భూ వివాదంతో ఈరోజు ఒకరు ప్రాణాలు కోల్పోగా. మరో మహిళ కు తీవ్ర గాయాలయ్యా యి సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి.జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని ఇప్పల గూడెం కు చెందిన డోంగిరి బుచ్చయ్య శు క్రవారం ఉదయం వివాదంగా ఉన్న సోదారి లింగయ్య భూమి దగ్గరికి వెళ్లారు. లింగయ్య, భార్య పద్మ , బుచ్చయ్య మొదట ఇద్దరు గొడవ పడ్డారు. దీంతో బుచ్చయ్య ఆవేశం తో లింగయ్య భార్య పద్మను పారతో కొట్టడంతో లింగయ్య భార్య పద్మ తీవ్ర గాయాలపాలయింది. ఈ విషయాన్ని సోదారి లింగయ్య తన కుమారుడు సోదారి పవన్ కు చెప్పారు. తల్లి గాయపడిన విషయా న్ని తెలుసుకున్న పవన్ ఆవేశంతో ఇంటికి వస్తున్న క్రమంలో మార్గమధ్యంలో కాటారంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోని పశువుల ఆసుపత్రి మందు దొంగిరి బుచ్చయ్య కనబడ్డాడు.వెంటనే పవన్ అక్కడే ఉన్న కర్ర తీసుకుని బుచ్చయ్య తలపై కొట్టగా కింద పడి అక్కడికక్కడే మరణిం చాడు. రెండు కుటుంబా లు సాగు చేసుకుంటున్న భూమికి ఎవరికి భూమిపై తగిన రికార్డులు లేవని, తెలిసింది,గతంలో కుడా ఈ రెండు కుటుంబాలు ఘర్షణ పడగా కేసులు నమోదు చేసినట్లు సీఐ నాగార్జున రావు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.



# 2025 లో వచ్చే బడ్జెట్‌లో
## మధ్యతరగతి వారికి భారీ ఉపశమనం



**ఢిల్లీ (మన వెలుగు) డిసెంబర్ 27 :** బడ్జెట్ 2025 మధ్యతరగతి ప్రజలకు పెద్దపీట వేయాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు సమాచారం. 2025 బడ్జెట్‌లో ఆదాయపు పన్ను తగ్గించవచ్చని భావిస్తున్నారు. ఇది లక్షలాది మంది పన్ను చెల్లింపుదారులకు ప్రయోజనం చేకూరుస్తుంది. వారి టేక్ హెూమ్ ఆదాయం పెరుగుతుంది. దీంతో వారికి ఎంతో ఉపశమనం కలిగించేందుకు కేంద్రం సిద్ధమవుతోంది.మధ్యతరగతి పన్ను చెల్లింపుదారులకు ప్రభుత్వం నుంచి పెద్ద ఊరట లభించనుంది. ఈ బడ్జెట్‌లో ప్రభుత్వం వార్షిక ఆదాయంపై రూ.15 లక్షల వరకు పన్ను బాధ్యతను తగ్గించవచ్చని నివేదికలు ఉన్నాయి. 1 ఫిబ్రవరి 2025న సమర్పించే రాబోయే బడ్జెట్‌లో దీనిని ప్రకటించ వచ్చని భావిస్తున్నారు. మందగిస్తున్న ఆర్థిక వ్యవస్థ, పెరుగుతున్న ద్రవ్యోల్బణం మధ్య వినియోగాన్ని ప్రోత్సహిం చడం ఈ ప్రతిపాదన లక్ష్యం.2020 పన్ను విధానంలో వార్షిక ఆదాయం రూ. 3 లక్షల నుండి రూ. 15 లక్షల వరకు 5-20 శాతం మధ్య పన్ను విధిస్తున్నారు. అయితే దీని కంటే ఎక్కువ సంపాదించే వ్యక్తులపై 30 శాతం పన్ను విధిస్తారు. కొత్త పన్ను విధానం ప్రకారం 3 లక్షల వరకు ఆదాయంపై 0 శాతం పన్ను విధిస్తున్నారు.3-7 లక్షల ఆదాయంపై 5 శాతం పన్ను. 7-10 లక్షల ఆదాయంపై 10 శాతం పన్ను.10-12 లక్షల ఆదాయంపై 15 శాతం పన్ను.12-15 లక్షల ఆదాయం పై 20 శాతం పన్ను.15 లక్షలు, అంతకంటే ఎక్కువ ఆదాయం 30 శాతం పన్ను విధిస్తున్నారు.నివేదిక ప్రకారం, జూలై-సెప్టెంబర్ 2024లో భారతదేశ జీడిపి వృద్ధి ఏడు త్రైమాసికాల్లో అత్యంత బలహీనంగా ఉంది. అదే సమయంలో ఆహార ద్రవ్యోల్బణం పట్టణ గృహాల ఆదాయంపై ఒత్తిడిని పెంచింది. వాహనాలు, గృహెూపకర ణాలు, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తుల డిమాండ్‌ను ప్రభావితం చేస్తుంది.అయితే ఆదాయపు పన్ను రేట్లలో ప్రభుత్వం ఎలాంటి కోత పెట్టనుందనేది ఇంకా నిర్ణయించలేదు. ప్రస్తుతం ఈ అంశం ప్రభుత్వంలో ఉన్నత స్థాయిలో చర్చనీయాంశమైంది. ఆదాయపు పన్ను రేట్ల కోత వల్ల ఖజానాకు ఎంత నష్టం వాటిల్లుతుందని అంచనా వేస్తున్నారు? ఆదాయపు పన్ను తగ్గింపు కారణంగా, ప్రజలు కొత్త పన్ను విధానాన్ని ఎంచుకోవాలనుకుంటున్నారు. ఇది పాత పన్ను విధానం కంటే సులభం.మధ్యతరగతి వారికి ఉపశమనం. నివేదిక ప్రకారం, పట్టణ ప్రాంతాల్లో నివసించే ప్రజలు అధిక జీవన వ్యయం, జీతాలు నామమాత్రంగా పెరగడం వల్ల తరచుగా ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఆదాయపు పన్నును తగ్గించడం ద్వారా వారి చేతికి ఎక్కువ డబ్బు వస్తుందని, దీంతో వారికి ఎంతో ఉపశమనంగా ఉంటుందని కేంద్రం భావిస్తోంది. ఇది వ్యక్తిగత ఖర్చులను మెరుగుపరచడమే కాకుండా భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుంది. వార్షిక ఆదాయం రూ. 15 లక్షల వరకు ఉన్న వ్యక్తులకు ఈ మార్పు ఎక్కువ ప్రయోజనం చేకూరుస్తుందని అంచనా.తి వారికి భారీ ఉపశమనం

# పోలీసుల ఆత్మహత్య అంతుచిక్కని మిస్టరీ



**కామారెడ్డి (మన వెలుగు) డిసెంబర్ 27 :** జిల్లాలో ముగ్గురి ఆత్మహత్యల కేసులో మిస్టరీ ఇంకా వీడలేదు. ఓ ఎస్సై, మహిళా కానిస్టేబుల్, ఓ యువకుడి ఆత్మహత్యలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఎస్సై సాయికుమార్, కానిస్టేబుల్ శృతి, కంప్యూటర్ ఆపరేటర్ నిఖిల్ మరణాలపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతుల సెల్ ఫోన్ డాటా, వాట్స్ ఆప్ చాటింగ్స్‌ను పోలీసులు పరిశీలిస్తున్నారు. అలాగే ఈ ముగ్గురి బంధువులు, స్నేహితులను విచారించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కేసులో ముగ్గురి పోస్టుమార్టం రిపోర్టులు కీలకం కానున్నాయి. ఇద్దరు పోలీసుల, ఓ యువకుడి ఆత్మహత్య రహస్యాన్ని చేధించేందుకు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో సదాశివనగర్ సీఐ సంతోష్, ఎస్సై రంజిత్‌లతో కూడిన ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. మరోవైపు నిన్న ఉదయం 11 గంటలకు కంప్యూటర్ ఆపరేటర్ నిఖిల్ బైక్‌పై బీబీపేట నుంచి బయలుదేరినట్లు పోలీసులు గుర్తించారు. నిఖిల్ తన బైక్‌ను ఎక్కడ పెట్టాడనేది తేలాల్సి ఉంది. అలాగే ఎస్ఐ సాయికుమార్ భార్య వాంగ్మూలం కీలకంగా మారనుంది. ఇవాళ ఎస్ఐ సాయికుమార్ స్వగ్రామం మెదక్ జిల్లా కొల్చారంకు దర్యాప్తు బృందం వెళ్లి సమాచారాన్ని సేకరించనుంది. భిక్కనూరు, కామారెడ్డి, బిబిపేట, అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు సమీపంలోని హెూటల్‌లలో సీసీ ఫుటేజ్‌లను దర్యాప్తు బృందం పరిశీలించనుంది. వారి ఆత్మహత్యకు కారణాలేంటి.. ప్రేమ వ్యవహారమా?..లేక వివాహేతర సంబంధమా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.కాగా కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం కుప్రియల్ గ్రామ శివారులోని అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్దచెరువులో దూకి ఎస్సై సాయికుమార్, కానిస్టేబుల్ శృతి, కంప్యూటర్ ఆపరేటర్ నిఖిల్ బలవన్మరణానికి పాల్పడ్డారు. పోలీసుల ఆత్మహత్య న్యూస్ వైరల్‌గా మారింది. మెదక్ జిల్లాకు చెందిన సాయికుమార్ 2018లో ఎస్సై అయ్యారు. ప్రస్తుతం భిక్కనూరు ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నారు. అలాగే 2014 బ్యాచ్‌కు చెందిన శృతి బీబీపేట పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తోంది. శృతికి గతంలో వివాహం జరుగగా.. ఆ తరువాత విడుకులు తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే సాయికుమార్, శృతికి మధ్య వివాహేతర సంబంధం ఉందనే ప్రచారం ఉంది. ఆ తరువాత శృతికి నిఖిల్‌తో స్నేహం ఏర్పడి అది ప్రేమకు దారి తీసిందని.. ఇరువురు పెళ్లి చేసుకోవాలని భావించినట్లు తెలుస్తోంది.విషయం తెలిసిన సాయికుమార్ నిన్న మధ్యాహ్నం శృతి దగ్గరకు వెళ్లారని.. ఆ తరువాత శృతి, నిఖిల్, సాయి కుమార్ కలిసి అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్దచెరువు వద్దకు వెళ్లినట్లు సమాచారం. అనంతరం వీరి మధ్య వాగ్వాదం చోటు చేసుకోగా.. క్షణికావేశంలో శృతి చెరువులో దూకి ఆత్మహత్యకు యత్నించగా.. ఆమెను కాపాడబోయి సాయికుమార్, నిఖిల్ కూడా చెరువులో దూకినట్లు పోలీసులు భావిస్తున్నారు. మొక్కలు, నాచు తీగల మధ్య చిక్కుకుపోయి సాయికుమార్, నిఖిల్ ఊపిరాడక చనిపోయి ఉంటారని పోలీసులు ఓ అంచనాకు వచ్చారు. వీరి మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. కాగా.. శృతి మొహంపై గాయాలు ఉన్నాయని సాయికుమార్, నిఖిల్ కలిసి తమ కుమార్తెను హత్య చేశారని ఆమె తల్లి ఆరోపిస్తోంది. మొత్తానికి ఈ ముగ్గురి ఆత్మహత్యలు పోలీసులకు సవాల్ అని చెప్పుకోవచ్చు. అసలు ఎందుకు ఆత్మహత్యకు చేసుకున్నారు... వివాహేతర సంబంధమే కారణమా లేక మరేదైనా ఉందా అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. త్వరలో ఈ మిస్టరీని చేధిస్తామని పోలీసులు చెబుతున్నారు.

## మా టీచర్లు మాకే కావాలంటూ విద్యార్థుల ఆందోళన

**జగిత్యాల ప్రతినిధి (మన వెలుగు) డిసెంబర్ 27 :** విద్యాశాఖలో సమగ్ర శిక్ష ద్వారా కస్తూర్బా గాంధీ బాలికల విద్యా లయం సిబ్బంది తమ రెగ్యులరై జేషన్ కోరుతూ గత 18 రోజులు గా ఉద్యమించడంతో, విద్యాబో ధన కుంటు పడకుండా ఉండేం దుకు జిల్లా విద్యాశాఖ ప్రత్యా మ్నాయ చర్యలుచేపట్టడంతో మండలంలోని పలురు మహిళా ఉపాధ్యాయులకు కేజీబీవీలో విధులు కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేశారు.ఈ మేరకుఇన్చార్జి ప్రత్యేక అధికారిగా గొడిసెలపేట బీసీ కాలనీలో పనిచేస్తున్న ఉపా ధ్యాయురాలు సుశీలను నియ మించడంతో శుక్రవారం విధుల్లో చేరడానికి పాఠశాలకు వెళ్లారు. ఆమె రాకతో ఒక్కసారిగా విద్యా ర్థులు నిరసనకు దిగారు.పాఠశా ల ఆవరణలో బైఠాయించి మా టీచర్లు మాకు కావాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఆమెను పాఠశాల లోపలికి రానివ్వకుండా అడ్డుకున్నారు. దీంతో చేసేది ఏమి లేక ఇన్చార్జి ప్రత్యేక అధికారిగా నియమితు లైన సుశీల వెనుతిరిగి వెళ్లారు. ఈ విషయాన్ని ప్రత్యేక అధికా రిని దీప మండల విద్యాధికారి ప్రభాకర్ కు సమాచారం అందిం చారు.వారు జిల్లా విద్యాశాఖ అధికారిదృష్టికి తీసుకువె ళ్ళారు. దీంతో జిల్లా విద్యాధికారి రాము పాఠశాలను ఆకస్మికంగా సంద ర్శించి . విద్యార్థులతో కలిసి భోజనం చేసి పరిస్థితిని సమీక్షిం చారు.అయిన విద్యార్థులుతమ ఉపాధ్యాయులేకావాలనిమొండి కేయడం కొసమెరుపు.



## దోపిడి కేసులో మరో నిందితుడు అరెస్ట్





**జగిత్యాల ప్రతినిధి (మన వెలుగు) డిసెంబర్ 27 :** జగిత్యాల జిల్లా బీర్పూర్ మండల కేంద్రంలో సంచలనం సృష్టించిన దోపిడికి సంబంధించిన కేసులో డిసెంబర్ 20న ఆరుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకోగా పరారీలో ఉన్న మరో నిందితుడు ముకునూరి కిరణ్ కుమార్ శుక్రవారం పోలీసులు ముందు లొంగిపోయినట్లు జగిత్యాల రూరల్ సీఐ వై.కృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను సీఐ వై.కృష్ణారెడ్డి వెల్లడించారు. దోపిడీ కేసులో నిందితులైన మున్నీసుల శ్రీనివాస్, చిప్పబత్తుల తులసయ్య, బక్కెనపల్లి అరుణ్, యశోద శ్రీనివాస్, సైదు సహదేవ్, రత్నం మాణి క్యం, ముకుమారి కిరణ్ కుమార్లు ఒక బృందంగా ఏర్పడి కొన్ని రోజుల నుండి కిరణ్ దగ్గర ఉన్న ఒక యంత్రంతో గుప్త నిధుల కోసం వెతుకుతూ ఉండేవారన్నారు. ఎక్కడ కూడా గుప్త నిధులు దొరకకపోవడంతో వారందరూ కలిసి ఎవరన్నా బాగా డబ్బులు ఉన్న వారి ఇంట్లో దోపిడి చేసి వచ్చిన డబ్బులతో జల్సా చేద్దామని తుమ్మెనాల దగ్గర గల సహదేవ్ హొటల్లో కలిసి బీర్పూర్లో డబ్బులు, బంగారం ఉన్న కాసం ఈశ్వరయ్య ఇంట్లో తాను, అతని భార్య మాత్రమే ఉంటారు, వారు ముసలి వాళ్లని, వాళ్ల ఇంట్లో చొరబడి దోపిడి చేస్తే మనకు డబ్బు, బంగారు ఆభరణాలు దొరుకుతాయని పథకం వేసుకొకున్నారని సీఐ తెలిపారు. ఈ నెల 13న రాత్రి అందరూ కలిసి తుమ్మెనాల దగ్గర గల సహదేవ్ హొటల్లో కలుసుకొని, మంకీ క్యాచ్లు ధరించి బొమ్మ తుపాకీలు పట్టుకొని కిరణ్ కుమార్, అరుణ్,తులసయ్య, మున్నీసుల శ్రీనివాస్ లు ఒక నెంబర్ లేని వైట్ కలర్ స్కూటీ, బ్లాక్ కలర్ బైక్ల మీద బీర్పూర్ కు వెళ్లి అర్ధరాత్రి 2.30 గంటలకు కాసం ఈశ్వరయ్య ఇంటి వెనకాల నుండి గోడ దూకి బాత్రూమ్ దగ్గర ఉన్నారు. ఉదయం 5 గంటలకు ఈశ్వరయ్య బాత్రూమ్ కు వెళ్లడానికి రాగా అతనిని గట్టిగా అదిమి పట్టి బొమ్మ తుపాకితో తల మీద కొట్టి చంపుతా మని బెదిరించినట్లు తెలిపారు. ఇంట్లోకి ఈడుచుకెల్లి ఈశ్వరయ్య, అతని భార్యను కూడా కొట్టి గుడ్డ పేగులు నోట్లో కుక్కి వారిని కట్టేశారన్నారు. వారి ఒంటి మీద ఉన్న బంగారు ఆభరణాలు, ఇంట్లో ఉన్న డబ్బులు దోపిడి చేసుకొని అక్కడి నుండి అటవీ మార్గం ద్వారా పారిపోయి తుమ్మెనాలకు చేరుకున్నారన్నారు. అప్పటికే అక్కడ సహదేవ్, రత్నం, మాణిక్యంలు ఉన్నారని వెల్లడించారు. జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు జగిత్యాల డీఎస్పీ రఘు చందర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి నిందితుల కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. పోలీసు విచారణలో కొందరు నిందితులను ధర్మపురి మండలంలోని తుమ్మెనాల గుట్ట దగ్గర ఉన్నారని సమాచారం ప్రకారం 20న సహదేవ్ హొటల్ దగ్గర ఆరుగురుని అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నారన్నారు. ఈ కేసులో పరారీలో ఉన్న మరో నిందితుడు ముక్కునూరి కిరణకుమార్ శుక్రవారం అతని భార్య, సోదరుని ఒత్తిడి మేరకు జగిత్యాల రూరల్ పోలీసుల ముందు లొంగిపోయాడు. నిందితుడి వద్ద నుండి బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకొని రిమాండ్కు తరలించామని తెలిపారు. ఈ కేసులో దోపిడికి గురైన బంగారు, వెండి ఆభరణాలు, నగదు మొత్తాన్ని రికవరీ చేసినట్లు తెలిపారు.

## మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరనిలోటు



**జగిత్యాల ప్రతినిధి (మన వెలుగు) డిసెంబర్ 27 :** ఆర్థిక సంస్కరణలకు దిక్సూచి మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అని, మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరనిలోటని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ కుమార్ అన్నారు. శుక్రవాం జగిత్యాల పట్టణంలోని ఇందిరాభవన్లో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల సంతాపం తెలుపుతూ కాంగ్రెస్ శ్రేణులతో కలసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విప్ అడ్లూరి మాట్లాడుతూ ఆర్థికమాంద్యం నుండి దేశాన్ని కాపాడేందుకు ఆర్థిక సంస్కరణలు చేపట్టారని, దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు, ఆర్థికాభివృద్ధికి ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్ పారదర్శకపాలన సాగించారని, జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని తీసువచ్చి గ్రామీణ నిరుపేదలకు పని కల్పించి వారి ఉపాధికి భరోసా కల్పించారన్నారు. అవినీతి పాలను అంతం చేసేందుకు, పాలనలో పారదర్శకతకు సమాచార హక్కు చట్టాన్ని అమలు చేసి సామాన్యుల చేతికి సమాచారహక్కును చేరువ చేసి అధికారుల్లో జవాబుదారీ తనం పెంపొందించేందుకు కృషి చేశారన్నారు. మన్మోహన్ సింగ్ పాలనలో తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. నిరుపేదల ఆకలి తీర్చేందుకు ఆహారభద్రత చట్టాన్ని అమలు చేశారని, మన్మోహన్ సింగ్ మృతితో దేశం గొప్ప ఆర్థికవేత్తను కోల్పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి నాయకులు బండ శంకర్, జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు టి.విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి, నాయకులు కొత్త మోహన్, సిరాజోద్దీన్ మన్సూర్, దుర్గయ్య, నిశాంత్ రెడ్డి, ముకస్సర్ అలీ నేహల్, చాంద్పాష, అలాఉల్లా, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప మెట్లపూజ మహోత్సవం

గొల్లపెల్లి (మన వెలుగు) డిసెంబర్ 27 : జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండలంలోని చిల్వాకోడూర్ గ్రామంలో తాండ్ర వినోద లక్ష్మణ్ గౌడ్ ధర్మకర్తలు ఆధ్వర్యంలో శ్రీ అయ్యప్ప ఆలయం గుట్టపై నిర్వహించిన శ్రీ అయ్యప్ప స్వామి మెట్ల పూజ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది.గురుస్వాములు చండీ ఉపాసకులు ఈదుల వాడ వినయ్ శర్మ కరకముల చేత శ్రీ గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, గౌరీ దేవి, శ్రీ చక్ర అర్చన, శ్రీ అయ్యప్ప స్వామి అభిషేకం, మెట్ల పూజ, జ్యోతి ప్రజ్వలన, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ అయ్యప్ప స్వామి పేట తుల్లి ఆటలు, నృత్యాలు, పాటలతో, అయ్యప్ప స్వామి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది.ఈ కార్యక్రమంలో గురు స్వాములు గందె వేణు, గంధం పరంధాములు, అల్లాడి వెంకన్న, తొట్ల లక్ష్మీరాజం, బొమ్మెన కుమార్, పప్పుల వెంకన్న, గర్వందుల గంగన్న, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## లయన్స్ క్లబ్ ఉచిత కంటి శిబిరం

**మెట్ పల్లి (మన వెలుగు) డిసెంబర్ 27 :** మెట్ పల్లి మండల వేంపేట గ్రామంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి శిబిరం నిర్వహించారు. ఈ మేరకు శుక్రవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన రాగ లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఇల్లెందుల శ్రీనివాస్ మాట్లాడుతూ రేకుర్తి హాస్పిటల్ వైద్యులచే దాదాపు 300 మంది కంటి వైద్య శిబిరాన్ని వినియోగించుకున్నారని ఇందులో 40మందికి ఆపరేషన్ నిమిత్తం లయన్స్ క్లబ్ నుండి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసి రేకుర్తి హాస్పిటల్ కి పంపించడం జరుగుతుందని మాట్లాడారు.ప్రతి ఒక్కరూ ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంవత్సరంలో ఆరు సార్లు కంటి వైద్య శిబిరం రెండుసార్లు గుండె, క్యాన్సర్ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తామని ఇటీవల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్యాన్సర్ వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని పట్టణ గ్రామీణ ప్రజలు లయన్స్ క్లబ్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఇల్లెందుల శ్రీనివాస్,సెక్రెటరీ గూండ రాకేష్,నాంపల్లి వేణు గోపాల్,గడ్డం శంకర్ రెడ్డి,వెల్మల శ్రీనివాస్ రావు,గాజంగి రాజమల్లయ్య,ఆల్ రౌండర్ గంగాధర్, అల్లూరి మహేందర్ రెడ్డి, రాఘవుల శేఖర్,ముత్యం రెడ్డి ,లయన్స్ క్లబ్ సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజ

**ముధోల్ (మన వెలుగు) డిసెంబర్ 27 :** మండల కేంద్రమైన ముధోల్ లో మహాలక్ష్మి గల్లీలో గురు స్వామి పోతన్న యాదవ్ ఇంట్లో అయ్యప్ప పడిపూజను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రణీత్ మహారాజ్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి విగ్రహాని కి పాలు, నెయ్యి, వివిధ రకాల పువ్వులతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామియే శరణం.. అయ్యప్ప శరణం అంటూ స్వా ములు భక్తి గీతాలను ఆలపించారు. ఈ పడిపూజ కార్యక్రమానికి మండల కేంద్రమైన ముధోల్ తో పాటు ఆయా గ్రామాల నుండి అయ్యప్ప స్వా ములు పెద్ద ఎత్తున పాల్గొన్నా రు. అనంతరం మహా పడిపూజ కార్యక్రమానికి వచ్చిన స్వాములందరికీ బిక్షాను ఏర్పాటు చేశారు. ఈ పడిపూజలో స్వాములు అనిల్తో పాటు అయ్యప్పస్వాములు పాల్గొన్నా రు.

## మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల
## కూకట్ పల్లి నియోజకవర్గ శేరి సతీష్ రెడ్డి దిగ్భ్రాంతి

**కూకట్పల్లి (మన వెలుగు)డిసెంబర్ 27 :** పముఖ ఆర్థిక వేత్త, మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణం పట్ల కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణంతో దేశం ఒక గొప్ప నాయకుడిని కోల్పోయిందని అన్నారు. వారు ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్నప్పుడే దేశంలో ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని అన్నారు మన రాష్ట్ర ఆవిర్భావానికి కృషిచేసిన మహానుభావుడు ఆయన అని పేర్కొన్నారు దేశానికి సేవ చేయడానికి తన జీవితాన్ని అంకితం చేసిన నాయకులు అతను తన జ్ఞానం మరియు భారతదేశ ఆర్థిక అభివృద్ధికి చేసిన అమూల్యమైన కృషి ఎల్లప్పుడూ గుర్తుండిపోతారు అన్నారు మన్మోహన్ సింగ్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలియజేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి సంతాపాన్ని తెలిపారు సంతాపం తెలియజేసిన వారిలో బి సంజీవరావు, లక్ష్మీనారాయణ, రేష్మ, రాజా ముదిరాజ్, శ్రీధర్ చారి, బాబురావు, రామకృష్ణారెడ్డి, సూరిబాబు, దుర్గా తదితరులు పాల్గొన్నారు.



## దేశ ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టిన,సంస్కరణల రూపశిల్పి రాజనీతజ్ఞుడి అకాల మరణం తీరని లోటు

**శేర్లింగంపల్లి (మన వెలుగు) డిసెంబర్ 27 :** కొండాపూర్ మసీద్ బండ భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో నాయకుల, కార్యకర్తల సమక్షంలో భారతదేశ మాజీ ప్రధాని కీర్తిశేషులు మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటు. దేశ ఆర్థిక వ్యవస్థను సంస్కరించడంలో ఆయన కీలక పాత్ర పోషించాలని దేశానికి ఆయన చేసిన సేవ,రాజకీయ జీవితం వినియంతో కూడిన నడవడిక ఎప్పటికీ గుర్తుండిపోతాయని తెలిపారు. పార్టీలకతీతంగా ఎవరెన్ని విమర్శలు చేసిన మౌనంగా తన పనిని తాను చేసుకుంటూ అంతే మౌనంగా తన జీవన ప్రస్థానానికి వీడ్కోలు పలికారని చింతిస్తూ. ఆనాడు ఆయన ప్రవేశపెట్టిన సమాచార హక్కు చట్టం (ఆర్టిఐ) పేద ప్రజల కోసం ప్రవేశపెట్టిన గ్రామీణ ఉపాధి హామీ పథకం,జాతీయ ఆహార భద్రత చట్టం,విద్య హక్కు చట్టం, ప్రతి పౌరునికి ఆధార్ ఆధార్ గుర్తింపు కార్డు ఉండాలని సదుద్దేశంతో ఎన్నో సంస్కరణలు తెచ్చి మంచి పేరు ప్రతిష్టలు గడించిన , ఆనాటి ప్రధాని వాజ్పేయి ప్రవేశపెట్టిన స్వర్ణ చతుర్భుజి వంటి కార్యక్రమాలను మన్మోహన్ సింగ్ సర్కార్ కొనసాగించింది అని కొనియాడుతూ ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆంజనేయు లు సాగర్,రాజు, రమేష్, కుమార్ యాదవ్,పద్మ,రేణుక, మహేష్, రాజు, ప్రదీప్,మహేష్ ,మధు,మనోజ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



## పెండింగ్ బిల్స్ విడుదలకై గాంధీ విగ్రహానికి వినతి పత్రం

**ముధోల్ (మనవెలుగు) డిసెంబర్ 27 :** తెలంగాణ రాష్ట్ర సర్పంచుల జాక్ పిలుపు మేరకు శుక్రవారం ఉదయం భైంసా పట్టణంలోని మార్కెట్ యార్డు ముందర గల గాంధీ విగ్రహానికి పూలమాల వేసి సర్పంచుల పెండింగ్ బిల్లుల విడుదల గురించి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. సర్పంచుల పదవీకాలం ముగిసి పదకొండు నెలలు అవుతోంది ఇంకా కూడా పెండింగ్ బిల్స్ ఒక్కరూపాయి కూడా విడుదల చేయకుండా సతాయించడము సబబు కాదు. పాత ప్రభుత్వం ఉన్నపుడు రేవంత్ రెడ్డి టీ పీసీసీ అధ్యక్షుడి హోదాలో కాంగ్రెస్ పార్టీ సర్పంచుల పెండింగ్ బిల్లులు హక్కుల గురించి హైదరాబాద్ ఇందిరాపార్క్ ముందర ధర్నా చౌక్ లో సర్పంచ్ ల కొరకు ధర్నా చేసి చివరకు పాత ప్రభుత్వం పోయి కాంగ్రెస్ పార్టీ గెలిచి, కొత్త ప్రభుత్వం వచ్చి ఏడాది అయింది ఇపుడు అధికారంలో రాగానే సర్పంచుల పెండింగ్ బిల్లులు మొదటి నెలలోనే విడుదల చేయాల్సిన నైతిక బాధ్యత ప్రభుత్వం మీద ఉన్నది. ఏడాదిగా బిల్లులు ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా అడిగితే అరెస్టులు గృహనిర్బంధాలూ చేయడం మాత్రం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమే. చేసిన అభివృద్ధి పనులకి బిల్లులు ఇచ్చి గౌరవించాల్సింది పోయి అరెస్టులు చేయడం అన్యాయమని అన్నారు. చివరికి సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నా కూడా ఇప్పటికి ఒక్క ఎమ్మెల్యే-మంత్రి- ముఖ్యమంత్రి పరామర్శించలేదని పేర్కొన్నారు. అసెంబ్లీ లో గంటలు గంటలు చర్చలు జరిపి చివరికి బిల్స్ ఎప్పుడిస్తారనే స్పష్టమైన హామీ ఇవ్వలేకపోవడం మాత్రం బాధ్యతారాహిత్యం. ఇప్పటికైనా సర్పంచుల బిల్లుల్ని ఈనెల 31లోపు ఇవ్వలని కోరారు. లేనియెడల పిల్లాపాపలతో వచ్చి సెక్రటేరియట్ భవనం ముందు కూర్చుంటామని తెలియజేస్తున్నాము. ఈ కార్యక్రమంలో తాలూకా సర్పంచులు సుకన్య రమేష్, లావణ్య కిష్టయ్య , రాకేష్ , రామ్ చందర్ బలేరావ్ , విజేష్ , శ్వేతా రవికిరణ్ గౌడ్, సాయినాథ్ , శ్రీనివాస్ రెడ్డి , అబ్దుల్ ఘనీ , రాజేందర్ వెంకటాపూర్ , దెగ్లూర్ రాజు , రామ్ రెడ్డి , మైసాజి , రాజేందర్ , శివాజీ, తదితర సర్పంచులు పాల్గొన్నారు.



## జీఓ నెం 51ని సవరించి శాశ్వత ఉద్యోగులుగా మార్చాలి

**ముధోల్ (మన వెలుగు) డిసెంబర్ 27 :** జీఓ నెం 51ని సవరించి శాశ్వత ఉద్యోగులుగా మార్చాలని కార్మికుల అధ్యక్షులు ఆకాష్ డిమాండ్ చేశారు. ముధోల్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయము ముందు గ్రామ పంచాయతీ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో తమ సమస్యల పరిష్కారానికి శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు వాగ్మారె ఆకాష్ మాట్లాడుతూ గ్రామాలలో పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, వీధి లైట్లు, డంపింగ్ యార్డ్, హరితహారం, పల్లె పకృతి వనాలు, వైకుంఠధామాలు, డ్రైవర్లు, ఆఫీసు నిర్వహణ తదితర పనుల్లో వివిధ కేటగిరీల వారీగా పనులు చేస్తూన్నాం. గ్రామీణ ప్రాంతాలలో ఎలాంటి అంటువ్యాధులు, అనారోగ్యాలు రాకుండా ప్రజలకు సేవలందిస్తున్నారు. 2018లో గత రాష్ట్ర ప్రభుత్వం జీఓ నెం. 51ని విడుదల చేసి సిబ్బంది వేతనాలను రూ.8,500లకు పెంచిందని మల్టీపర్పస్ వర్కర్లుగా మార్చిన తరువాత ఎవరైనా ఏపనినైనా చేయాలనే నిబంధన పెట్టి కార్మికులపై ఒత్తిడి పెంచిందన్నారు. కార్మికులు తమకు న్యాయమైన వేతనాలు, పిఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు, శాశ్వత ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. పెండింగ్లో ఉన్న జీతాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ సమస్యలను త్వరగా పరిష్కరించకపోతే ఆందోళనలు మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ కార్మికులు శంకర్, శ్రీకాంత్, ఆకాష్, రవి, సాయినాథ్, మహరతన్, కేర్బ, జల్బ, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మృతితో
## భారతదేశం ఒక గొప్ప నాయకుడిని కోల్పోయింది

**కూకట్పల్లి(మన వెలుగు) డిసెంబర్ 27 :** భారత దేశ మాజీ ప్రధాని డా. మన్మోహన్ సింగ్ (92) మృతి పట్ల సంతాపం తెలియచేస్తూ గాంధీ భవన్ లో వారి చిత్ర పటానికి ఘనంగా నివాళులు అర్పించిన టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు టి. కుమార్ రావు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం, ప్రధాన కార్యదర్శులు చరణ్ కౌశిక్ యాదవ్, జగదీష్ తదితరులు. అనంతరం మీడియా సమావేశంలో పాల్గొన్న సత్యం శ్రీరంగం. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్థిక సంస్కరణలతో దేశ భవిష్యత్తును ఉత్తమంగా తీర్చిదిద్దిన పరిపాలనా దక్షుడు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం చాలా బాధాకరం అన్నారు. మన్మోహన్ సింగ్ ప్రధానిగా, ఆర్థిక మంత్రిగా,రాజ్యసభ సభ్యుడిగా, వాణిజ్య మంత్రిత్వశాఖ సలహాదారుగా, ఆర్థికశాఖ ప్రధాన సలహాదారుగా,ఆర్థిక మంత్రిత్వశాఖ కార్యదర్శిగా, ప్రణాళిక సంఘం ఛైర్మన్గా, ఆర్బీఐ గవర్నర్గా, ప్రధాని సలహాదారుగా, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిటీ ఛైర్మన్ వంటి బాధ్యతలు నిర్వహించారని, దేశాన్ని సుదీర్ఘకాలం పాలించిన ప్రధానుల్లో ఒకరని అన్నారు. దేశ ఆర్థిక చరిత్రనే మలుపు తిప్పిన నాయకుడని, చారిత్రాత్మకమైన ఎన్నో పథకాలు మన్మోహన్ సింగ్ హయాంలోనే రూపుదిద్దుకున్నాయని, జాతీయ ఉపాధి హామీ పథకం ఆయన హయాంలోనే పురుడుపోసుకుందని అన్నారు. విద్యాహక్కు చట్టం, సమాచారహక్కు చట్టం, జాతీయ ఆహార భద్రతా చట్టం, ఆధార్ కార్డు, వివిధ పథకాల్లో లబ్ధిదారులకు ప్రత్యక్ష నగదు బదిలీ వంటి విధానాలను ఆయన సర్కారే అమలు చేసిందన్నారు. మన్మోహన్ సింగ్ దేశానికి చేసిన సేవలకుగాను భారత ప్రభుత్వం ఆయనను పద్మ విభూషణ్ పురస్కారంతో సత్కరించిందని అన్నారు. మన్మోహన్ సింగ్ మృతితో భారతదేశం ఒక గొప్ప నాయకుడిని కోల్పోయిందని, మన్మోహన్ సింగ్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నామని అన్నారు.




## గ్రామ గ్రామన బిజెపి బూత్ కమిటీలు ఏర్పాటు

**నిర్మల్ ప్రతినిధి (మన వెలుగు) డిసెంబర్ 27 :** నియోజకవర్గం లో గ్రామ గ్రామాన బిజెపి బూత్ కమిటీ ఎన్నికలు పూర్తి చేయడం జరిగిందని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్, బిజెపి జిల్లా అధ్యక్షులు అంజకుమార్ రెడ్డి అన్నారు. శు క్రవారం బిజెపి సాంస్థగత ఎన్నికల పర్వం లో భాగంగా ఎమ్మెల్యే నివాసం లో బిజెపి నాయకులతో సమావేశం ఏర్పాటు చేసిన సందర్భంగా మాట్లాడారు. సాధారణ సభ్యత్వాలు, క్రియాశీలక సభ్యత్వా లు, పూర్తవడం జరిగిందన్నారు.ఈ నెల 29,30,31,తేదీ లలో మండల అధ్యక్షుల ఎన్నిక ప్రక్రియ పర్వం ప్రారంభం అవుతుందన్నారు.సభ్యత్వ నమోదుకు గ్రామాల్లో విశేష స్పందన లభిస్తుందన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా కార్యకర్తలు పాటుపడాలన్నారు.కార్యక్రమం లో పార్లమెంట్ కన్వీనర్ అయ్యన భూమయ్య, ఎన్నికల ఇంచార్జి రవిపాండే, బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు నారాయణ్ రెడ్డి,నియోజకవర్గ కన్వీనర్ సాయినాథ్, జిల్లా ఉపాధ్యక్షులు తాలోడ్ శ్రీనివాస్,మహిళ మోర్చా నాయకురాలు సిరం సుష్మ రెడ్డి,పట్టణ అధ్యక్షులు మల్లేష్, మండల అధ్యక్షులు భూమేష్,కౌన్సిలర్ గాలి రవి, సతీష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు..



## విప్లవ కారుల ఐక్యతతో ప్రజా ఉద్యమాలను బలోపేతం
### - న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి జే. రాజు

**ముధోల్ (మన వెలుగు) డిసెంబర్ 27 :** హైదరాబాద్లో జరిగే న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభను జయప్రదం చేయాలని సీపీఐ ఎం ఎల్ న్యూడెమోక్రసీ నిర్మల్- అదిలాబాద్ జిల్లా కార్యదర్శి జే. రాజు పిలుపునిచ్చారు. డిసెంబరు 28 న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే రెండు న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభ పోస్టర్ ఆవిష్కరణలో మాట్లాడుతూ ఈ సభకు ప్రధాన వక్తగా సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి ధర్మన్ సింగ్ ఖట్కర్ హాజరవుతారని తెలిపారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఫాసిస్టు విధానాలను అమలు చేస్తూ ప్రజల మధ్య ఉన్న సోదర భావాన్ని దెబ్బతీస్తుందన్నారు. గత పది ఏళ్ల కాలంగా పచ్చి కార్పోరేట్ విధానాలను అవలంబిస్తూ దేశ సహజ సంపదనంతా దోచిపెట్టిందన్నారు. దేశంలో ఆకలి, అసమానతలు, నిరుద్యోగం, హక్కుల హనన, ప్రశ్నించే వారిని అణిచివేయడం, నిత్య కృత్యంగా జరుగుతుందన్నారు. ఇలాంటి.కష్ట కాలంలో దేశంలో ఉన్న విప్లవకారులు అంతా ఐక్యమై ప్రజల తరఫున పోరాటం చేయాలన్నారు. నక్సల్ బరి, శ్రీకాకుళం, గోదావరిలోయ పోరాటాల ప్రేరణతో ఏర్పడిన న్యూడెమోక్రసీ పార్టీ ప్రజల తరపున పోరాడిన ఘనమైన చరిత్ర- ఉందన్నారు. అనేకమంది వీరులు తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించి నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని కాంక్షించారన్నారు. అమరవీరుల ఆశయ సాధనకు రెండు న్యూడెమోక్రసీ పార్టీలు ఐక్యమవుతున్నాయని అన్నారు. భవిష్యత్తులో విప్లవకారులందరినీ ఐక్యం చేసి బలమైన ప్రజా ఉద్యమాలను నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నిర్మల్ డివిజన్ సెక్రటరీ ఎం. హరిత, నాయకులు గంగాధర్, జైభీమ్, పాల్గొన్నారు.



## ఏజెన్సీలో పులి కలకలం....!

**కొత్తగూడ (మన వెలుగు) డిసెంబర్ 27 :** ఏజెన్సీలో చాలా రోజుల తరువాత పులి సంచరిస్తుందనే సమాచారం గిరిజన ప్రాంత ప్రజల్లో కలకలం రేపింది. మండలంలోని ఊటాయి,కొనపూర్,సాధిరెడ్డి పల్లి పరిధిలోని ఉన్న అటవీ ప్రాంతాన్ని డీ ఎఫ్ ఓ విశాల్, ఎఫ్ డీ ఓ చంద్రశేఖర్ లా ఆదేశాలమేరకు నర్సంపేట రేంజ్ పరిధిలోని నీ మూడు చుక్కలపల్లి పరిధిలో ఉన్నటువంటి కొత్తగూడ రేంజ్ అటవీ ప్రాంతాన్ని కొత్తగూడ రేంజ్ అధికారి వజహత్ నేతృత్వంలో ఆ ప్రాంతాలాన్ని క్షుణంగా పరిశీలించారు..అటవీ జంతు వు ఈ ప్రాంతంలో తిరిగినట్టు ఏమైనా పాదముద్రలు ఉన్నాయా? ఏ జంతువు అనేది వాటి పాదముద్రల ఆధారంగా గుర్తించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. అవసరమైతే అనుమానాస్పద ప్రాంతాల్లో ట్రాప్ కెమెరాలు పెడతామన్నారు. అలాగే కోనాపూర్,సాధిరెడిపల్లి, ఓటాయి , సమీప గ్రామప్రజలు ప్రయాణాలు చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని కొత్తగూడ రేంజర్ వజహత్ సూచించారు. ఈ కార్యక్రమం లో డి ఆర్ ఓ కరుణ,సెక్షన్ ఆఫీసర్ రాజేష్,బీట్ ఆఫీసర్లు వేణు,సతీష్,తదితరులు పాల్గొన్నారు.